ఉన్నా ప్రజలు జాగరూకులై వుండాలి. నూటికి నూరుపాళ్ళు ప్రజాప్రతినిధులనే; ప్రజాహితైషులనే ముఖ్యంగా - ప్రాంతీయ మనస్తత్వాలకుగాని- కుల మత, వర్గవైషమ్యాలకుగాని, అతీతులైనవారినే ఎన్నుకొనడం ప్రజలవిద్యుక్తధర్మం. ఓటుఅధికారం చేతులో పెట్టుకొని సరియైనతీర్పుచెప్పాలి ప్రజలు. నిజాయితీ పరులనే ఎన్నికలకు నిలబెట్టవలసిన బాధ్యత ప్రజాస్వామిక పార్టీలమీద ఉన్నది అని కూడా ఆయాపార్టీలు గమనించాలి. ప్రజలు ఈ నాటికైనా తెలివితెచ్చుకుని తమ వోటువిలువను గుర్తించి, దృష్టిపథంలో ఉంచుకొని, ప్రజలను మోసపుచ్చి మభ్యపెట్టే ప్రతినిధుల కెవ్వరికీ రేపటి ఎన్నికలలో ఒక్క ఓటుకూడా వేయరాదు.

తన రక్తమాంసాలను ధారపోసి, ఏభయ్యొనిమిది రోజుల పర్యంతం, స్థిరచిత్తంతో, మృత్యుముఖ గహ్వరంలోకి పయనంకట్టిన ఈ అమరయశస్విని జ్ఞప్తికి తెచ్చుకుని, వారి ఆశయ సిద్ధాంతాలను మననంచేసుకుని మన రేపటికాబోయే నాయకులు కార్యోన్ముఖులవాలి. అప్పుడే స్వర్గీయ పొట్టి శ్రీరాములుగారికి ఆత్మసంతృప్తి, శాంతీని. ఆయన గావించిన నిస్స్వార్థసేవా త్యాగం ఫలప్రదమవుతుంది.

స్కెచ్

# సంజీవయ్యా బీచి షికారు

"ప్రాభా"

ఎండ శీతాకాలందైనా కాస్త చురుగ్గానే ఉంది. ఉదయం తొమ్మిది గంటలవేళ. సముద్రతరంగాల మీదనుంచి చల్లటి శీతగాలులు వస్తున్నాయి. బీచి యిసక కొద్దిగా వేడిఎక్కడానికి ప్రారంభిస్తోంది.

ఆరడుగులకి అరడుగు తక్కువ పొడవైన ఒక్క పల్చటి మనిషీ, ధోవతికట్టూ, నిండుచేతుల చొక్కా, దానిపైని యిక రెండుమూడు రేవుల్లో పూర్తిగా విడిపోయే కోటూ, కోటు చేతుల్లోంచి కుక్కనాలికల్లా వేలాడుతూన్న లాల్చీ చేతులూ, ఒకచేతిలో చిక్కంలో పెట్టబడిన సన్ బ్రాండు ఫ్లాస్కూ, మరొకచేతిలో ఆఫీసు కాయితాలతో కట్టబడ్డ పాడ్—సంజీవయ్య (ఆ.యన్. జి. వో. సంజీవయ్య) ఊగుకుంటూ, జోగుకుంటూ వచ్చి వచ్చి ఆ తొమ్మిది గంటల వేళప్పుడుబీచిలో కూర్చున్నాడు.

సముద్రం మీదనుంచి వస్తున్న చల్లనిగాలీ, మీదనుంచి వెచ్చగా కాస్తున్న చిన్నయెండా, సమశీతోష్ణంగా చాలా హాయిగా ఉంది.

టౌన్ హాలు వరండాలో పచారుచేస్తూ పేపరు చూస్తూ యిదంతా గమనిస్తున్నాను.

సంజీవయ్యను నాకు తెలుసుగాని అట్టే పరిచయంలేదు. ఏదో అవసరంపడి ఆఫీసులో అతనితో ఒకటిరెండుసార్లు మాత్రం మాట్లాడాను.

ఏదో పడిపోయింది కామోసు వెతుక్కుంటున్నాడనుకుని సహాయం చెయ్యడానికని బయలుదేరాను. తీరా దగ్గరకువెళ్లి చూసేసరికి అతనేమీ వెతుకున్నట్టుగానీ, ఏదైనా వస్తువ పోయిన ఆత్రుతగానీ కనుపించలేదు. అయినా వేళ కాని యీ వేళలో యిక్కడకువచ్చి కూర్చోవలసిన అగత్యంలో అంతర్యం ఉండకపోదని 'నమస్తే సంజీవయ్యగారూ!' అన్నాను!

'నమస్తే! నమస్తే! తమరా ఎక్కడో తమని చూసినట్టుంది. మట్టిబుర్ర తెలివితేటలు ఎంతసేపూ కాగితాలమీదనేగాని మనుషులమీద పనిచెయ్యకుండా ఉన్నాయి.' అన్నాడు కళ్లజోడు సవరించుకుంటూ.

'ఒకటి రెండుసార్లు తమదగ్గరకు వచ్చానులెండి'

'అవునవును. అదేజ్ఞాపకం'

'తమరిక్కడ కూర్చుంటే ఏదో పడిపోయింది కామోసు వెతుక్కుంటున్నారనుకుని వచ్చాను.'

'థాంక్స్. ఏమీపడిపోలేదులెండి. చూసారా మాకు రోజూ ఆఫీసు విడిచిపెట్టేసరికి రాత్రి ఎనిమిది గంటలకు తక్కువకాదు. అప్పుడు బయలుదేరి కాళ్లీడ్చుకుంటూ యింటికి వచ్చేసరికి ఎనిమిదిన్నరా, పావుతక్కువ తొమ్మిదీ అవుతుంది.

అందుచేత యీ పూరువచ్చి దగ్గరదగ్గర ఒక సంవత్సరం అయినా ఒకరోజైనా సరదాగా సాయింత్రం బీచికి రావడానికి వీలు చిక్కింది కాదు. యిక సాయంత్రం ఎలాగునా వెళ్లడం కుదరదని నిశ్చయించుకుని యిప్పుడు సరదాగా యిలా వచ్చాను.'

కష్టంమీద నవ్వు ఆపుకొని 'మా బాగా చెపుతున్నారే ఒకరోజైనా కనీసం ఒక ఆదివారం నాడైనా మీకు వీలుపడలేదా?'

'మా కుగాదులులేవు మా కుషస్సులు లేవు అన్నాడు మహాకవి. అలాగే మాకు ఆదివారాలూ లేవూ, హాలీడేలూ లేవూ. అగడ్తలోపడ్డ పిల్లికి అదే వైకుంఠం అన్నట్లు పగలు పదకొండు గంటల నుంచి రాత్రి ఎనిమిదిగంటల వరకూ ఆఫీసే స్వర్గం అదే మోక్షం.'

'మీ ఓర్పుని మెచ్చుకోవాలి'

'ఓర్పుకి మమ్మల్ని చెప్పి తరువాత గాడిదల్ని చెప్పాలి'

'పాపం మీపరిస్థితి చాలా కనికరించవలసిందే'

'అంతా అలాగే అంటారు. పెద్దపెద్ద వాళ్లు కూడా మాపట్ల సానుభూతిని ప్రకటిస్తారు. మాకు మిగిలింది అదే.'

ఇంతలో ఆ తోవంట వెళుతూన్న మరో యస్. జీ. వో. వచ్చాడు. యిదేవాటం కాని సంజీవయ్యకన్న కాస్త వయస్సు మళ్లినవాడు.

'ఏంవోయ్ సంజీవి. ఏమిటి యిక్కడ కూర్చున్నావేమిటి ఏదైనా రహస్య కార్యక్రమమా?'

'రహస్యంలేదూ, నాబొందాలేదు. యిక్కడ సరదాగా యిలా వచ్చాను. బీచిసరదా తీరడం ఎలామరి. సాయంత్రం వీలుపడదుకదా'

"వీరెవరు" అన్నాడు నన్నుచూస్తూ

"మన సానుభూతి పరుడు"

"వీరు సీతారామయ్యగారు. మా ఆఫీసులో గుమాస్తా" అని పరిచయంచేసాడు.

"ఇంక లేవోయ్ సంజీవి. తాపీగానడిచి వెళుతూంటే ఆఫీసుటైం అవుతుంది" అన్నాడు సీతారామయ్య.

అందరం బయలుదేరాం.

సాయంకాలం అమ్మే వేడివేడి బటానీలవాడు దుకాణంలో బటానీలు వేచుతున్నాడు.

"ఓయ్! సీతారామయ్యా! మనం సాయంకాలంవచ్చి ఎలాగూ కొనుక్కోలేం గనుక ఇప్పుడే కొనుక్కుని నములుకుంటూపోతే మంచిది కదూ" అన్నాడు సంజీవయ్య.

వాళ్ళపరిస్థితిచూసి నవ్వాలో ఏడవాలో తెలియటంలేదు.

అందరం బటానీల దుకాణం దగ్గరకు వెళ్ళాం.

"ఓ కానీ బటానీలు ఇయ్యవోయ్" అన్నాడు సంజీవయ్య.

"కానీ బేరంలేదండి"

"కానీ బేరం లేదుటోయ్ శీతారామయ్యా!"

" అదేమిటోయ్ కానీ బేరంలేక పోవడమేమిటి? మరి కానీ ఎందుకు పుట్టాయనుకున్నావ్" అన్నాడు సీతారామయ్య.

"ఏమోనండి ఎందుకు పుట్టాయో. బహుశా సేల్సుటాక్సు కోసరం సృష్టించి ఉండవచ్చు. కాని మేం కానీ బేరాలు మానుకున్నాం కిట్టుబాటులేక"

"మేం ఎవరిమో తెలుసా" అన్నాడు సంజీవయ్య.

"ఎవరైతే నాకేమండి. నాకు కావల్సింది బేరం. డబ్బు"

"అయితే ఇవ్వవన్నమాట" అన్నాడు శీతారామయ్య.

"మంచి బేరమే. శివామని మంచిబోణీ వచ్చింది. ఊపట్టండి పట్టండి"

"అదేమిటోయ్ మహా ఉత్తపుణ్యానికి ఇస్తున్నట్టు మూలుగుతావేంటి"

"చాల్లెండి మా చెడ్డబేరంగాని"

"అదేమిటోయ్. మనిషికి రెండు గింజలైనా రావద్దా"

"బటానీలు రోజూ తిన్న మొగాల్లాగే ఉన్నాయి. వెళ్ళండి బాబూ వెళ్ళండి."

"నీ దుకాణం దగ్గర ఉండిపోంలే"

అందరం బయలుదేరాం.

"ఎవడో పొగరుబోతులా ఉన్నాడు ఆఫీసరులాగ" అన్నాడు శీతారామయ్య.

"చూసారా సార్. బటానీల వాడికి కూడా లోకువైపోయాం" అన్నాడు సంజీవయ్య నాతో.

ఏమనాలో తెలియక "నాకు ఇలా శలవు ఇప్పించండి" అంటూ సందుపట్టాను. ★